## కథ

# వల

**జొన్నకూటి మార్టిన్ ఫిన్‌లె**

**బస్సు ఎప్పటికి వస్తుందో... తను ఎప్పటికి ఇంటికి చేరుతాడోననుకుంటూ అసహనంగా దిక్కులు చూస్తూ కూర్చున్నాడు రవీన్. యధాలాపంగా తలతిప్పిన అతడికి తనక్కొంచెం దూరంలో బస్ షెల్టర్ పిల్లర్ కానుకుని తనవేపే చూస్తున్న అమ్మాయి కనిపించింది. అతడు చూడటంతో ఆమె పెదవులు విచ్చీ విచ్చనట్టుగా చిన్నగా నవ్వింది.**

ఇదివరలో ఆమెను ఎప్పుడూ ఎక్కడా చూసిన గుర్తు రాలేదు. అలాంటప్పుడు తనని చూసి ఎందుకు నవ్వినట్టు? ఆలోచిస్తూనే ఆమెను తేరిపార చూశాడు.

వయసు పద్దెనిమిది, పందొమ్మిది మధ్య ఉంటుందేమో... పసుపు పచ్చటి శరీరఛాయ, మంచి ఎత్తు, ఎత్తుకు తగ్గ శరీర సౌష్టవంతో చూపరులను ఇట్టే ఆకర్షించే రూపం. ఒంటికి అతుక్కున్నట్టు ఉన్న చుడీదార్‌లో నిండైన ఆమె యవ్వనం బందీ అయి, బిగుతుగా, బింకంగా కనిపిస్తోంది.

'ఎంతటి అందం' అనుకుంటూ, ఆబగా ఆమెకేసి చూడసాగాడు రవీన్. అతడు తననే పట్టి పట్టి చూస్తుండటంతో ఆమె అతడి దగ్గరగా వచ్చింది. చూపుడువేలుని అతడికేసి చూపుతూ ''సుధాకర్ కదూ...'' అంది.

ఆమె తనని ఎవరో 'సుధాకర్' అనుకొంటోంది కాబోలు! అందుకే తను చూసినపుడు అలా నవ్వింది. ఇప్పుడు తను 'ఔను' అనాలా 'కాదు' అనాలా ఆలోచనలో పడ్డాడు రవీన్. 'ఎదురుగా అందమైన అమ్మాయి. ఔను అంటే మాటలు కలపొచ్చు. పరిచయం పెంచుకోవచ్చు...'

అతడి ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ... ''ఏమిటి మాట్లాడరు. నన్ను గుర్తుపట్టలేదూ..'' అంది.

ఇంత దగ్గరగా తనని చూసి కూడా ఇంకా ఆమె తనని తనకు తెలిసిన ఎవరో సుధాకర్‌గానే పొరబడుతూ, తానెవరో గుర్తు చేయటానికి ప్రయత్నిస్తుందంటే తను ముమ్మూర్తులా ఆ సుధాకర్‌నే పోలి వున్నాడన్నమాట. ఔను సుధాకర్‌నే అంటే... ఎంచక్కా ఆమెతో పరిచయం పెంచుకోవచ్చు. ఆ తర్వాత నెమ్మదిగా ప్రేమలోకీ దించొచ్చు. అపుడీ అందమంతా తనదే అవుతుంది అని ఓ నిర్ణయానికొచ్చి ''ఔను కాని మీరు...'' ఆమె ఎవరో తనకింకా గుర్తుకు రాలేదన్న అర్థం వచ్చేలా నసిగాడు ఆమె ఎవరో ఆమె చేతే చెప్పించాలని.

ఓ క్షణం ఆమె మొహం చిన్నబోయింది అతడు తనని గుర్తించకపోవటంతో. అయితే అంతలోనే నవ్వేస్తూ...

''విజయవాడలో మీ పక్కింట్లో రూపని... ఔన్లెండి. విజయవాడ నుంచి మీ నాన్నగారికి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ కావడంతో మీరు ఇక్కడకి వచ్చేసి ఐదేళ్లు దాటింది కదా! అప్పుడు నేను నైన్త్ స్టాండర్డ్. మీరేమో ఇంటర్. వయసుకొద్దీ వచ్చిన మార్పుల వల్ల మీరు నన్ను గుర్తుపట్టలేకపోవచ్చు. కానీ నేను మిమ్మల్ని గుర్తు పట్టాను'' అంటూ చొరవగా అతడి పక్కనే కూర్చుంది.

ముక్కూ మొహం తెలీని ఓ అందమైన అమ్మాయి... భుజాలు రాసుకునే అంత దగ్గరగా తన పక్కనే కూర్చోవడం... తనతో అత్యంత సన్నిహితంగా మాట్లాడుతూండటం... అతడికెంతో ఆనందాన్నిస్తోంది. తంతే బూరెల బుట్టలో పడటం అంటే ఇదేనేమో! అనుకోని విధంగా తనకు పట్టిన అదృష్టానికి మనసులో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు రవీన్. ఆమె పరిస్థితీ అలాగే ఉంది. ఎన్నాళ్ల తర్వాతో... తనకు కావలసిన వాణ్ణి కలిసిన ఆనందం ఆమె మొహంలో స్పష్టంగా కనిపిస్తోంది.

ఇంతకూ ఆ అసలు సుధాకర్ ఎవరో... విశాలమైన ఈ హైదరాబాద్‌లో ఎక్కడున్నాడో?

''ఇంకా నన్ను గుర్తుపట్టలే...'' అడిగింది.

''అహ. గుర్తుపట్టాను. కానీ నువ్వు ఇక్కడ....'' అన్నాడు ఆమె గురించి తెలుసుకొనే ప్రయత్నంగా.

''అదా! నాన్నగారు రైల్వేస్ కదా! ఆయనకు ఇక్కడకి ట్రాన్స్‌ఫర్ అయింది ఈ మధ్యనే. హైదరాబాద్ అంటే ఎగిరి గంతేసాననుకోండి. ఇక్కడికి వచ్చిన తర్వాత కాలేజికి వెళ్తున్నా... షాపింగ్‌కి వెళుతున్నా... ఏ పనిమీద బయటకు వచ్చినా నా కళ్లు మీ కోసమే వెదికేవి. అసలు ఈ విశాలమైన సిటీలో మిమ్మల్ని పట్టుకోగలనా లేదా అనే అనుమానం కూడా కలిగింది. చివరికి ఆ దేవుడి దయ వల్ల... అబ్బ! ఇన్నాళ్లూ ఎంత టెన్షన్ పడ్డానని'' అంది. సంతోషంతో ఆమె మొహం వెలిగిపోతోంది.

బహుశా ఈమె ఆ నైన్త్ స్టాండర్డ్ వయసులోనే ఆ సుధాకర్ పట్ల ఇష్టమో... ప్రేమో... పెంచుకుని ఉండాలి. అందుకే ఇంత ఆనందం. అనుకున్నాడు. ఇదే సందర్భంలో ఒరిజినల్ సుధాకర్ అయితే ఆ పాత రోజుల్ని గుర్తు చేసుకుంటూ ఇన్నాళ్ల తర్వాత ఆమెను కలిసినందుకు ఎంతగా రియాక్ట్ అయ్యేవాడో? తను అంత కాకపోయినా కొంతైనా రియాక్ట్ కాకపోతే బహుశా తనంటే ఇష్టం లేదేమోనని ఆమె అనుకోవచ్చు. అనుకుంటూ ''ఇన్నాళ్లూ నేనూ నిన్ను మిస్సయ్యాను. ఎనీవే... వియ్ ఆర్ లక్కీ...'' అన్నాడు రవీన్ సుధాకర్ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేస్తూ.

''రియల్లీ. పదండి అలా ఏదైనా పార్క్‌కి వెళ్దాం. మీతో చాలా మాట్లాడాలి'' అంటూ అతడి చేయి పట్టుకు లేపుతూనే అటుగా పోతున్న ఆటోని పిలిచింది.

ఐదు నిమిషాల్లో ఇద్దరూ సంజీవయ్య పార్కులో ఉన్నారు.

పార్కులో - అంతా టీనేజర్సే! అమ్మాయిలు... అబ్బాయిలు... జంటలు, జంటలుగా...! అందరికీ ఉద్దేశించినదే అయినా 'ప్రేమికుల'కు మాత్రమే పరిమితమై విరాజిల్లుతున్న పార్కు అది. ఆమె తనని ఈ పార్కుకి తీసుకురావడం అంటే... 'మనమూ ప్రేమికులమే' అని అన్యాపదేశంగా చెప్పడానికేనపించింది. ఆ భావనకే అతడి మనసు పులకించిపోయింది.

ఇద్దరూ ఓ చోట కూర్చున్నారు. ఆమె ఒకప్పటి సంగతులు గుర్తుచేయసాగింది. అతడు తనకి సైకిల్ నేర్పడం... సైన్స్ డ్రాయింగ్స్ వేసి పెట్టడం... డాబా మీదికెక్కి వెనుకింట్లోని మామిడిచెట్టు నుంచి కాయలు కోసి ఇవ్వడం... గుర్తు చేసుకుంటూ ఏవేవో చెప్పుకొస్తోంది. నకిలీ సుధాకర్ అయినందున రవీన్ వాటిని అనుభూతించలేక ''ఆ...ఆ!. అవును కదూ... ఔనౌను'' అంటూ పొడిపొడిగా బదులివ్వసాగాడు.

''నువ్వొట్టి వాగుడుకాయవి. టీవీ యాంకర్‌గా అయితే బాగా పనికివస్తావని అంటారంతా. మీకు అలానే అనిపిస్తున్నానా? బోర్‌కొడుతున్నానా?'' అంది మాటలాపి.

అప్పటికి గాని అర్థం కాలేదు. ఎంతసేపూ ఆమె తప్ప తనేం మాట్లాడటం లేదని, ''ఛ...ఛ... అలాంటిదేం లేదు. కాకపోతే నువ్వు మాట్లాడుతుంటే... నిన్నే చూస్తూ... నీ మాటలు వినాలనిపిస్తుంది'' అన్నాడు తెలివిగా.

సంధ్య చీకట్లు ముసురుకున్నాయి. పార్కులో లైట్లు వెలిగాయి.

''అమ్మకు ఫోన్ చేస్తాను లేటవుతుందని. లేదంటే కంగారుపడుతుంది'' అంటూ బ్యాగ్ తెరిచి సెల్‌ఫోన్ బయటకు తీసింది.

ఆమె తనతో మరింతసేపు గడపాలనుకుంటోందని అర్థమైంది రవీన్‌కి. తినడానికి ఏమైనా తెస్తే సరదాగా తింటూ కబుర్లు చెప్పుకోవచ్చనను కుంటూ లేచాడు.

''ఎక్కడికి'' అడిగిందామె.

''కేంటిన్‌కి'' చెప్పాడు.

''పదండి నేను వస్తాను. సెల్ చార్జింగ్ డౌన్ అయింది. కేంటిన్‌లో ఫోన్ ఉందేమో చూస్తాను'' అంది.

'తన దగ్గర సెల్‌ఫోన్ లేదనుకుంటోందేమో...' అనుకుంటూ జేబులోంచి సెల్ తీసి అందిస్తూ, ''నువ్వు ఫోన్ చేస్తుండు. ఈలోపు నేను వెళ్లి తినడానికేమైనా తెస్తా'' అన్నాడు. ఆమె బ్యాగులోంచి ఐదు వందల నోటు తీసి అతడికందించబోయింది. రవీన్ చిన్నబుచ్చుకున్నట్టుగా మొహం పెట్టి ''అంటే నా దగ్గర డబ్బుల్లేవనా? లేక నీ కోసం ఖర్చు పెట్టడానికి వెనుకాడేవాడిననా నీ ఉద్దేశ్యం'' అన్నాడు తెచ్చిపెట్టుకున్న ఉక్రోషంతో.

''ఓకే...సారీ!'' అంది లెంపలు వేసుకుంటూ.

అతడు నవ్వుకుంటూ కేంటీన్ దిక్కుగా బయలుదేరాడు.



అతడికి పట్టలేనంత ఆనందంగా ఉంది. సుధాకర్‌గా ఆమెను నమ్మిస్తున్నందుకు కొద్దిగా అపరాధ భావమూ కలిగింది. మళ్లీ అంతలోనే 'తను ఆమెను సుధాకర్‌గా నమ్మించి ఉండొచ్చు. కానీ తను ఆమెను ప్రేమిస్తున్న మాట నిజం. ఆమెనే పెళ్లి చేసుకుంటాడు కూడా. అలాంటప్పుడు ఆమెను మోసం చేయడం ఎలా అవుతుంది' అనుకున్నాడు. కేంటిన్‌లో స్నాక్స్, కూల్‌డ్రింక్స్ తీసుకుని తిరిగి వచ్చాడు.

ఇంతకు ముందు తాము కూర్చున్నచోట రూప కనిపించలేదు. ఎక్కడికి వెళ్లి ఉంటుంది? అనుకుంటూ చుట్టూ కలియజూశాడు. ఎక్కడా ఆమె జాడ కనిపించలేదు.

ఎవరైనా తెలిసిన వాళ్లు కనిపిస్తే వాళ్లతో మాట్లాడుతూ వెళ్లి ఉంటుందా? లేక- టాయిలెట్ వైపు వెళ్లి ఉంటుందా? అనుకుంటూ అక్కడే కూర్చున్నాడు వస్తుందిలే అని.

ఐదు.. పది.. పదిహేను నిమిషాలు గడిచాయి. అర్థగంట దాటింది. ఐనా ఆమె రాలేదు. రవీన్ అయోమయంలో పడ్డాడు. అంతలో అతడికేదో ఆలోచన తట్టింది.

ఆ ఆలోచన రాగానే అతడు ఒక్క ఉదుటున కేంటిన్ వైపు పరుగుతీసి ఫోనందుకుని తన సెల్‌కి డయల్ చేశాడు. 'స్విచ్‌డాఫ్' అని బదులొచ్చింది. మళ్లీ డయల్ చేశాడు. మళ్లీ మళ్లీ డయల్ చేశాడు. ఒక్కటే సమాధానం! అదే సమాధానం!!

అందమైన అమ్మాయిలు కొందరు ఈమధ్య వయసులో ఉన్న అబ్బాయిలకు తెలివిగా వలపన్ని వాళ్ల నుంచి సెల్‌ఫోన్లు కాజేస్తున్న వైనం కొద్దిరోజుల క్రితం పేపర్లలో వచ్చిన సంగతి జ్ఞాపకానికొచ్చింది. తన సెల్‌ఫోన్ తిరిగిరాని తీరాలకు తరలిపోయిందని నిర్ధారణకు రావడానికి రవీన్‌కి ఎంతోసేపు పట్టలేదు.

'అమ్మాయి కనిపిస్తే చాలు ఆమె ఎవరు... ఏమిటి... అనే ఆలోచన కూడా ఉండని తన బోటి వెర్రిబాగులోళ్ల బలహీనత ఇలాంటి నెరజాణలకు ఇప్పుడొక అవకాశంగా మారిందన్న మాట...' అనుకుంటూ నీర్సంగా ఇంటి దారి పట్టాడు రవీన్ అలియాస్ సుధాకర్.